TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 192   శుక్రవారం 07-03-2025   పేజీలు : 06   వేల : 05/-

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

**- ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా ప్రభుత్వం నిజాలను దాచి ఉంచింది**

**- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ మార్చి 6 :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలను దాచి ఉంచిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే రెండు నివేదికలు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి, నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం ముందుకు పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ గతంలో రెండు నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా, కేవలం కమీషన్ల కోసమే పనులను నిర్వహించిందని కేటీఆర్ అన్నారు. ఆ నివేదికలలో చెప్పిన విధంగానే రెడ్ జోన్ ప్రాంతంలోనే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎనిమిది కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మొత్తం కేబినెట్ ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ రెండు నివేదికల అంశంపై స్పష్టతను ఇవ్వాలని.. హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది కుటుంబాలతో పాటు రాష్ట్ర ప్రజల తరఫున ఈ అంశంపై పూర్తి వివరాలు విడుదల చేయాలని కేటీఆర్ అడిగారు. ఈ ప్రమాదానికి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ

**- హకీంపేటలో ఇండస్ట్రీయల్ పార్క్ భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు**



**హైదరాబాద్ మార్చి 6 :** సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు భూసేకరణ చేపట్టవద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలెపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంటతండా పరిధిలో సుమారు 1358.37 ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది ఆగస్టులో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే సీఎం రేవంత్ రెడ్డి అల్లుడు కంపెనీ కోసం భూసేకరణ అంటూ ఆరోపణలు రావడం, లగచర్ల రైతుల పోరాటం నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. లగచర్ల, పోలేపల్లిలో ఫార్మా విలేజ్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించింది. ఈ క్రమంలోనే మళ్లీ ఇండస్ట్రీయల్ కారిడార్ పేరిట హకీంపేటలో భూసేకరణ చేయడానికి సిద్ధమైంది. దీంతో పలువురు రైతులు భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. భూసేకరణ ప్రక్రియకు స్టే విధిస్తూ తీర్పు వెలువరించింది. తదుపరి విచారణను వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం



**హైదరాబాద్ మార్చి 6 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. అయితే తాజాగా కిషన్ రెడ్డి.. రేవంత్ రెడ్డి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డివి గాలి మాటలు అని.. వాటికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం తనకు లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన రేవంత్‌కు ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారని అన్నారు.ముందుక ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలి అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, దళితుకు రూ.12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఆయన గుర్తు చేశారు. వాటిని వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## నూతన ఎమ్మెల్సీలకు మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ మార్చి 6 :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. తెలంగాణకు చెందిన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని అభినందించారు. బిజెపికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పని చేస్తున్న ప్రతీ ఒక్క కార్యకర్తను చూసి గర్విస్తున్నానని మోడీ పేర్కొన్నారు. మరోవైపు ఏపిలో విజయం సాధించిన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలుపుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్‌ను మోడీ రీపోస్ట్ చేశారు. కేంద్రం, ఏపి ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తుందని.. రాష్ట్ర అభివృద్ధికి ప్రయాణాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని మోడీ పేర్కొన్నారు.

## నితీశ్‌ను తాను రెండుసార్లు ముఖ్య మంత్రిని చేశా : తేజస్వి యాదవ్ కీలక వ్యాఖ్యలు



**బీహార్ మార్చి 6 :** బీహార్ రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ఆ రాష్ట్రంలో ఈ ఏడాది ఆఖరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ అధికార ఎన్డీఏ నేతలకు, ప్రతిపక్ష ఆర్జేడీ నేతలకు మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే రెండు వైపుల నుంచి ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ , మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయికి చేరాయి. తాజాగా సీఎం నితీశ్ కుమార్‌పై తేజస్వి యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నితీశ్‌ను తాను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశానంటూ వ్యాఖ్యానించారు.ఇటీవల బీహార్ అసెంబ్లీలో నితీశ్ సర్కారు బీహార్‌కు ఏం చేసిందని తేజస్వి ప్రశ్నిస్తే.. నీ తండ్రిని నాయకుడిని చేసిందే నేనని నితీశ్ కౌంటర్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తేజస్వి యాదవ్ బుధవారం స్పందించారు. జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కు రెండుసార్లు రాష్ట్రంలో అత్యున్నత పదవిని దక్కించుకోవడానికి తానే సాయం చేసినట్లు చెప్పారు. చిక్కుల్లో పడ్డ ఆయన పార్టీని తానే ఆదుకున్నానని వ్యాఖ్యానించారు.

## మన మిత్ర' ప్రజల చేతిలోనే ప్రభుత్వం పాలన



**అమరావతి మార్చి 6 :** ఆంధ్రప్రదేశ్ లో డిజిటల్ గవర్నెన్స్ శక్తికి 'మన మిత్ర' నిదర్శనమని ఎపి మంత్రి నారాలోకేష్ అన్నారు. సామాన్యుల ప్రయోజనం కోసం ఈ ఫౌర- కేంద్రీకృత సేవలు విస్తరిస్తూనే ఉంటాయని తెలిపారు. నారా లోకేశ్ మాట్లాడుతూ 'మన మిత్ర' ప్రజల చేతిలోనే ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, తమది ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. "ప్రజలు ధృవపత్రాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా పౌర సేవలను వేగవంతంగా అందజేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ కు కూటమి ప్రభుత్వం నాంది పలికింది. దేశంలో తొలిసారిగా 'మన మిత్ర' పేరుతో ఎపి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ కు శ్రీకారం చుట్టింది. మన మిత్ర వాట్సప్ గవర్నర్నెన్స్ సేవలు 200కు పెంచామని తెలిపారు. 200 సేవలు అందించే అద్భుత మైలురాయి సాధించిందని పేర్కొన్నారు. మన మిత్ర కోసం 9552300009కు సందేశం పంపండి" అని నారా లోకేష్ కోరారు.

## జానా రెడ్డి పై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు హేయనీయం

**న్యూఢిల్లీ మార్చ్ 6 :** తెలంగాణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర చైర్మన్ క్రాంతి కార్ పోకల కిరణ్ మాదిగ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ బంధువు సీనియర్ నేత మాజీ మంత్రి కుందురు జానారెడ్డి గారు పై చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న ) వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.జానారెడ్డి గారి జీవితం మొత్తం పేద దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నిగర్వి, సుదీర్ఘ తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేని మకుటంలేని మహా మనిషి వారికి కులం, మతం ,వర్గం అంటూలేని తెలంగాణ సాధకుడు జానారెడ్డి గారు, ఇలాంటి విలువలు కలిగిన వ్యక్తి పట్ల స్థాయికి మించి మాట్లాడితే మంచిది కాదు అని,నీకు దమ్ము ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించు అంతేకాని జానారెడ్డి గారి జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నల్లగొండ జిల్లాలో ప్రతి మాదిగ పల్లెను అడుగు జానయ్య మాదిగ అని,ప్రతి మాల పల్లెను అడుగు జానయ్య మాల అని,ప్రతి తండాను అడుగు జాను నాయక్ అని,జాన య్య గౌడ్ అని,జానయ్య యాదవ్ అని,జానయ్య ముదిరాజ్ అని ఇలా సబ్బండ వర్గాల ఆరాధ్యుడిగా ఉన్న జానారెడ్డి గారు కుల గణన విషయంలో కుట్రలు చేస్తున్నారని విమర్శించే అర్హత చింతపండు నవీన్ కు లేదన్నారు.నీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ఎలా బుద్ధి చెప్పాలో మాకు బాగా తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద రావు గారు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపివేత



అమెరికా అధ్యక్షుడు డొనా ల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ ఇటీవల మీడియా ఎదుటే వాగ్వాదాని కి దిగడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఈ నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. రష్యాతో యుద్ధం సాగుతున్న పరిస్థితుల్లో ఉక్రెయిన్‌కు అందించే మిలిటరీ సాయాన్ని నిలిపివేసింది. అధ్యక్షుడు ట్రంప్ శాంతిస్థాపనపై దృష్టి సారించారు. మా భాగస్వాములు కూ డా ఆ లక్షానికి కట్టుబ డి ఉండాల్సిన అవసరం ఉంది. మేము మా సాయాన్ని నిలిపివేస్తున్నాం. ఇది ఒక పరిష్కారాన్ని చూపిస్తోంది ” అని వైట్‌హౌస్‌కు చెం దిన ఓ అధికారి వెల్లడించారు. అయితే ఇది తాత్కాలికమేన ని వెల్లడించారు. రష్యాతో శాంతి చర్చలకు కీవ్‌పై ఒత్తిడి తెచ్చేందుకే ఈ నిర్ణ యం తీసుకున్నట్టు తెలుస్తోంది. లండన్‌లో ఐరోపా దేశాధినేతల సమావేశం తరువాత జెలెన్‌స్కీ అగ్రరాజ్యంతో ఖనిజాల ఒప్పందానికి తాము సిద్ధమేనని ప్రకటించారు. ఉక్రెయిన్‌కు మిలిటరీ సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయా న్ని ఉక్రెయిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖం డించింది. అగ్రరాజ్యం తమకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు క్రమం గా తమ దేశాన్ని రష్యాకు లొంగిపోయేలా చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నట్టు ఉన్నాయని ఆ దేశ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చీఫ్ మెరెజ్‌కో ఆరోపించారు.

# భారత్‌తో మా సంబంధాలు బలంగానే ఉన్నాయి



ఢాకా : భారత్‌బంగ్లా దేశ్ మధ్య సంబంధాలు క్షీణించాయనే వాదనలను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కొట్టి పారేశారు. ఢాకా, ఢిల్లీల మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయన్నారు. బీబీసీ బంగ్లాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. భారత్ బంగ్లాల మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని విభేదాలు తలెత్తాయి. అవి వచ్చి పోయే మేఘాల్లాంటివి. తప్పుడు సమాచారం , దుష్ప్రచారాలే ఈ సంఘర్షణలకు కారణం. వీటిని తొలగించేందుకు , ఇరు దేశాల మధ్య సహకారాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మా అధికారులు నిరంతరం ఆ దేశంతో సంప్రదింపులు జరుపుతున్నారు.” అని యూనస్ పేర్కొన్నారు.

# పాక్‌లో సైనిక స్థావరంపై ఆత్మాహుతి దాడి



పెషావర్ : పాకిస్తాన్‌లో ఒక సైనిక స్థావరంపై ఇద్దరు ఆత్మాహుతి సభ్యులు చేసిన దాడిలో నలుగురు చిన్నారులుసహా తొమ్మిది మంది మరణించారు. మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని బన్ను జిల్లాలోని ఉన్న సైనిక స్థావరంపై మంగళవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సమయంలో ఈ దాడి జరిగింది. సైనిక స్థావరం గోడను దాటుకుని లోపలకు రావడానికి ఆత్మాహుతి సభ్యులు ప్రయత్నించారు. సైన్యం బాంబర్లను అడ్డుకోవడానికి ప్రయత్నించింది. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక భద్రతాధికారి ఈ దాడి గురించి మాట్లాడుతూ విశాలమైన సైనిక ప్రాంతం గోడ దగ్గర ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు తమను తాము పేల్చుకున్నారని, తరువాత మరికొంత మంది సభ్యులు స్థావరంలో ప్రవేశించడానికి ప్రయత్నించారని, వారందర్నీ హతమార్చామని చెప్పారు. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు తాలిబన్లకు అనుబంధంగా ఉండే జైష్ అల్ ఫుర్సాన్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిలో పదుల సంఖ్యలో పాకిస్తాన్ సైనికులు మరణించారని కూడా తెలిపింది. పాక్ అధికారులు ప్రాణనష్టంపై స్పందించ లేదు. బన్ను జిల్లా ఆసుపత్రి మాత్రం తొమ్మిది మంది మరణించినట్లు తెలిపింది. మృతుల్లో నలుగురు చిన్నారులని కూడా వెల్లడించింది. వీరంతా సైనిక స్థావరం సమీపంలో నివసించేవారని తెలిపింది. బాంబు పేలుడు కారణంగా సమీపంలో ఇళ్లు, ఇతర భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని స్థానికులు చెప్పారు. పైకప్పులు, గోడలు కూలిపోవడంతో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.

# మన్నార్ జలసంధిలో ఖనిజాల అన్వేషణను ఆపాలి



మన్నార్ జలసంధిలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం జారీ చేసిన వేలం నోటిఫికేషన్ విషయంలో జోక్యం చేసుకోవలసిందిగా అభ్యర్థిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం ఒక లేఖ రాశారు. ఆ ప్లాన్ ‘సాగరప్రాంత పర్యావరణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది, లక్షలాది మంది మత్సకారుల జీవనోపాధిని దెబ్బ తీస్తుంది’ అని స్టాలిన్ సూచిస్తూ అందులో ఉన్న ఇబ్బందులను ఉటంకించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించలేదని ఆయన తెలిపారు. ‘ప్రధాని నరేంద్ర మోడీ ! మన్నార్ జలసంధి బయోస్ఫియర్ రిజర్వ్‌లో పెట్రోలియం, సహజ వాయువు అన్వేషణ కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన వేలం నోటిఫికేషన్ వల్ల సాగరప్రాంత పర్యావరణ వ్యవస్థకు, లక్షలాది మంది జాలర్ల జీవనోపాధికి నష్టం వాటిల్లుతుంది’ అని స్టాలిన్ ‘ఎక్స్’ పోస్ట్‌లో పేర్కొన్నారు. ‘తీవ్రమైన పర్యావరణ, సాంఘిక ఆర్థిక పర్యవసానాలు ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకునే ముందు తమిళనాడు ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. ఈ వేలం నోటిఫికేషన్ రద్దుకు మీరు వెంటనే జోక్యం చేసుకుని, సాగర వారసత్వ సంపదను, తీరప్రాంత సమాజాలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాను’ అని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు.

# నావల్లే లాలూ రాజకీయాల్లో ఎదిగారు

పాట్నా : ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌పై బీహార్ సిఎం నీతీశ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతనిపై సీఎం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో బీహార్‌లో అభివృద్ధి ఏమీ జరగలేదని, తన హయాంలోనే జరిగిందన్నారు. ఈ సందర్భంగా తన వల్లే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని, వ్యాఖ్యానించారు. “ గతంలో బీహార్‌లో పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుందా ? సాయంత్రం అయ్యిందంటే ఎవ్వరూ బయటకు వచ్చేవారు కాదు. నీవు చిన్నపిల్లాడివి. వెళ్లి ప్రజలను అడుగు. మీ నాన్న ఈ స్థాయిలో ఉన్నాడంటే అది నావల్లే. లాలూకు ఎందుకు అండగా నిలుస్తున్నారని మీ సొంత మనుషులే అడిగారు. అయినప్పటికీ మద్దతు ఇచ్చా.” అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన తేజస్వియాదవ్, రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాట్లాడారు. ఆదాయం లేనప్పటికీ బడ్జెట్ పెరుగుతూ పోతుండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను అబద్ధాల పుట్ట అని ఆరోపించారు. తన తండ్రి లాలూ ప్రసాద్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం అన్నీ తప్పుడు లెక్కలేనని, విమర్శించారు. ముఖ్యమంత్రి నీతీశ్ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో తేజస్వీ అడ్డుకునే ప్రయత్నం చేయగా, తేజస్వీపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# సెర్బియా పార్లమెంట్‌లో గందరగోళం




సభలో పొగ బాంబులు విసరడంతో మంగళవారం సెర్బియా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా ముగ్గురు పార్లమెంట్ సభ్యులు గాయపడగా, వారిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. విశ్వ విద్యాలయ విద్యకు నిధుల పెంపునకు ఉద్దేశించిన చట్టంపై ఓటింగ్ జరగాల్సి వుంది. ఈ సమావేశమే చట్ట విరుద్ధమైనదని వాదిస్తూ ప్రతిపక్ష పార్టీలు, ముందుగా ప్రధాని మిలోస్ వుసెవిక్ ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. సమావేశం ప్రారంభమైన గంట తర్వాత పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. సెర్బియా ఎదుగుతోంది, పాలన క్షీణిస్తోంది అని రాసి వున్న బ్యానర్‌ను చేబూని, ఈలలు ఊదుతూ ప్రతిపక్ష సభ్యులు సభలో నినాదాలు చేశారు. దీంతో ఎంపీల మధ్య తొలుత ఘర్షణ మొదలైంది. ఆ వెంటనే పొగ బాంబులు విసురుకున్నారని బయటకు వచ్చిన వీడియోలను బట్టి తెలుస్తోంది. గుడ్లు, నీళ్ళ సీసాలను కూడా ఒకరిపై ఒకరు విసురుకున్నారు. ఈ అల్లర్లలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రతిపక్షం తీవ్రవాదుల్లా వ్యవహరిస్తోందని పార్లమెంట్ స్పీకర్ అనా బ్రనబిక్ విమర్శించారు. ఈ సంఘటనతో దేశంలో రాజకీయ సంక్షోభం ఎంతలా నెలకొందో స్పష్టమవుతోంది. నెలల తరబడి కొనసాగుతున్న అవినీతి వ్యతిరేక నిరసనలతో ప్రభుత్వం అట్టుడికిపోతోంది. ఆందోళనలు ఉధృతం కావడంతో ప్రధాని వుసెవిక్ తన పదవికి జనవరిలో రాజీనామా చేశారు. పార్లమెంట్ ఇంకా దాన్ని ఆమోదించాల్సి వుంది.

# రష్యాకు లొంగిపోయేలా చేయడానికే
# మిలిటరీ సాయం నిలిపివేత

ఉక్రెయిన్‌కు మిలిటరీ సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఉక్రెయిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అగ్రరాజ్యం తమకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు క్రమంగా తమ దేశాన్ని రష్యాకు లొంగిపోయేలా చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నట్టు ఉన్నాయని ఆ దేశ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చీఫ్ మెరెజ్‌కో ఆరోపించారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ , ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మధ్య వాగ్వాదం నెలకొన్న నేపథ్యంలో కీవ్‌పై ఒత్తిడి తీసుకురావడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని యూరోపియన్ దేశాలు ఆరోపించాయి. అగ్రరాజ్యం సాయం లేకుండా కీవ్ రష్యాతో పోరాటం చేయగలదా ? అని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రకటన వెలువడిన అనంతరం ఐరోపా దేశాల నేతలు అత్యవసర చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. జర్మనీ తదుపరి ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఫ్రెడరిక్ మెర్జ్ అమెరికా ప్రకటనను వ్యతిరేకించారు. ట్రంప్ నిర్ణయం ఉక్రెయిన్ రక్షణ ప్రయత్నాలను మరింత బలపరిచే ఉద్దేశ పూర్వక చర్చగా ఉందని అన్నారు. ఈ నిర్ణయం వల్ల ఉక్రెయిన్‌కు ఇప్పటికే అందుబాటులో ఉన్న వందల మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలపై ప్రభావం పడనుందని ది న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది.

# టారిఫ్‌లతోనే ప్రతిఘటనప్రపంచ మార్కెట్లు అతలాకుతలం



అమెరికా అసంబద్ధ వాణిజ్య సుంకాలపై చైనా ప్రతిఘటన చర్యలు ప్రకటించింది. అదే బాటలో కెనడా, మెక్సికో దేశాలు ట్రంప్ విధానాలపై ఢ అంటే ఢ అన్నట్లు దీటుగా బదులిచ్చాయి. కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై తమ ప్లాన్ ప్రకారమే మంగళవారం నుంచే సుంకాలను అమలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ తెలిపారు. చైనా దిగుమతులపై ప్రస్తుతమున్న 10 శాతం సుంకాలను 20 శాతానికి చేర్చుతున్నామన్నారు. అమెరికాకు దీటుగా చైనా ప్రతీకార చర్యలను ప్రారంభించింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ నెల 10 నుంచి అదనంగా 10-15 శాతం సుంకాలను విధించనున్నట్లు చైనా ఆర్థిక శాఖ వెల్లడించింది. చికెన్, గోదుమలు, మొక్కజొన్న, పత్తి సహా అన్నింటిపై సుంకాలు పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. దీంతో ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధానికి తెరలేపినట్లయ్యింది. వాషింగ్టన్ నుంచి ఎదురయ్యే వాణిజ్య సుంకాల బెదిరింపును ఎదుర్కోవడానికి తమ వద్ద ప్లాన్ బి, సి, డి ఉన్నాయని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పేర్కొన్నారు.

# మహారాష్ట్ర శాసనసభను కుదిపేసిన
# ఎస్పీ ఎంఎల్‌ఏ అజ్మీ వ్యాఖ్యలు



ముంబై : మొఘల్ చక్రవర్తి ఔరంగజేబును అవమానిస్తూ ఎస్పీ ఎంఎల్‌ఏ అబు అసిం అజ్మీ చేసిన వ్యాఖ్యలు మంగళవారం మహారాష్ట్ర శాసన సభ ఉభయ సభలను కుదిపేశాయి. అధికారంలో ఉన్న మహాయుతి సభ్యులు ఆయనను సస్పెండ్ చేయాలని, ఆయనపై రాజద్రోహం అభియోగం మోపాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉభయ సభలు వాయిదా పడ్డాయి. ఎన్సీపి మంత్రి ధనంజయ్ ముండే రాజీనామాపై ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్లాన్ చేసిన రోజున ఈ పరిణామం చోటుచేసుకుంది. ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభం కాగానే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అజ్మీపై చర్య తీసుకోవాలని కోరతూ మహాయుతి సభ్యులు నినాదాలు చేశారు. అజ్మీ మరాఠ రాజు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను హింసించి దారుణంగా చంపిన ఔరంగజేబు వారసుడని వారు దుయ్యబట్టారు. ఉపముఖ్యమంత్రి, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే శాసన మండలి, శాసనసభలో అజ్మీపై దాడికి నాయకత్వం వహించారు. శాసన మండలిలో మాజీ ముఖ్యమంత్రి అయిన ఏక్‌నాథ్ షిండే ‘అజ్మీ ఇదివరలో కూడా మరాఠ రాజు ఛత్రపతి శివాజీ మహారాజ్‌పై అభ్యంతరకర ప్రకటనలు చేశారు. అబు అజ్మీ కావాలనే శివాజీ కుమారుడు ఛత్రపతి శంభాజీని కూడా కించపరిచారు. శంభాజీ మహారాజ్ ధైర్యం, ఔరంగజేబు క్రూరత్వం ప్రజల రోమాలు నిక్కబొడిచేలా(గూస్‌బంప్స్) చేస్తాయి’ అని షిండే వివరించారు. ‘ఔరంగజేబు శంభాజీ మహారాజ్‌ను అమానవీయ పద్ధతిలో చిత్రహింసలు పెట్టాడు. ఔరంగజేబు మంచి పరిపాలనదక్షుడని, మందిరాలు నిర్మించాడని, కానీ కాశీ విశ్వేశర మందిరాన్ని ధ్వంసం చేశాడని అజ్మీ పేర్కొన్నారు’ అని షిండే అన్నారు. ‘ఔరంగజేబు కేవలం హిందువులనే కాదు, ఇతర మతస్థులను కూడా హింసించాడు. ఔరంగజేబు గెలిచినా ఓడిపోయినవాడి కిందే లెక్క. కాగా శంభాజీ తన ధైర్య సాహసాలతో ప్రాణ త్యాగం చేసినా గెలిచినట్లే లెక్క. ఔరంగజేబు ఓ దయ్యం. ఔరంగజేబును కీర్తించడాన్ని ఎవరూ సహించరు.అజ్మీ ఓ ద్రోహి. అతడికి మహారాష్ట్ర అసెంబ్లీలో కూర్చునే అర్హత లేదు.

# కోస్గి టూ మద్దూర్ వాయ దౌల్తాబాద్ 4వే లైన్ రోడ్డు శంకుస్థాపన




**కొడంగల్ (మన వెలుగు )మార్చి 06 :** దౌల్తాబాద్ మండల కేంద్రం లో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తిరుపతి రెడ్డి కోస్గి %శీ% మద్దూర్ వయా దౌల్తాబాద్ 4 లైన్ రోడ్డు భూమి పూజ చేశారు. దింతో కర్ణాటక నుండి మహబూబ్ నగర్ కు వెళ్లే వాహనాలకు టోల్ ప్లజా బారి నుండి తపించుకొని వెళ్లేవారు. ఈ వాహనాల వల్ల ఈ రోడ్డు రద్ది గా మారిపోయింది. ఇపుడు 4 లైన్ రోడ్డు పనులు ప్రారంభం కావడం తో వాహనాల సమస్య తగ్గుతుంది. ఈ రోడ్డు వల్ల దౌల్తాబాద్ మండల కేంద్రం నుండి కోస్గికి , మద్దూర్ కి,4 వే లైన్ రోడ్డు ఏర్పాటు జరుగనుంది. ఈ కార్యక్రమం లో దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొడిమ్యాల పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

## - ప్రజలకు అందుబాటులోకి ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించాలి






**కొడిమ్యాల (మన వెలుగు) మార్చి 06 :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాల ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించా లని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలని తెలియజేశారు. ఎస్పీ వెంట ఎస్ఐ సందీప్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# గ్రామ గ్రామానికీ బీసీ వాదాన్ని తీసుకెళ్తాం

## - కులగణన పత్రాలు తగులబెడితే సస్పెండ్ చేస్తారా..?

## - ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్ (మన వెలుగు) మార్చి 06 :** బీసీలకు అన్యాయం జరుగుతుందని మాట్లాడుతుంటే బీసీ నేతలను అణగదొక్కుతున్నారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీలను కించపరిస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి గ్రామ గ్రామానికి బీసీ వాదాన్ని తీసుకెళ్తామని, బీసీ మేధావులతో చర్చించి భవిషత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. బీసీ జేఏసీతో కలిసి ముందుకెళ్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పు అని పత్రాలు తగులబెడితే తనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నానంటూ తనను సస్పెండ్ చేయించారని ఆరోపించారు. తనను సస్పెండ్ చేస్తే బీసీ ఉద్యమం ఆగిపోదన్నారు. ఈ సందర్భంగా ఫ్రేమ్‌లో పెట్టి ఇచ్చిన సస్పెన్షన్ కాపీని ప్రదర్శించారు. బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రక్షణ కోసమే బీసీ జనాభా తగ్గించారన్నారు. 2028లో బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ బతకాలని కోరుకుంటున్నానని అన్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే యోచన లేదని ఈ సందర్భంగా చెప్పారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు వట్టే జానయ్య యాదవ్, సంగెం సూర్యారావు, పి.సత్యం వంశరాజ్, గటిక విజయ్‌కుమార్, ఓదేలు యాదవ్, రజని తదితరులుపాల్గొన్నారు.

# ప్రేమ జంట ఆత్మహత్య



**కరీంనగర్ (మన వెలుగు ) మార్చి 06 :** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం చిత్యలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్, భూపాలపట్నానికి చెందిన నాంపల్లి అలేఖ్య రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అరుణ్ కుమార్ కరీంనగర్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కరీంగనర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న అలేఖ్య కొంతకాలంగా ఇంట్లోనే ఉంటోంది. అలేఖ్యకు మరో అబ్బాయితో నిశ్చితార్థం చేశారు తల్లిదండ్రులు. దీంతో తమ ప్రేమ ఫలించదేమోనని, కలిసి జీవించడం సాధ్యం కాదని అరుణ్, అలేఖ్యలు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే గురువారం(ఫిబ్రవరి 6) నాడు కరీంనగర్‌లోని తన మిత్రుడి ఇంటికి అలేఖ్యను తీసుకెళ్లిన అరుణ్ కుమార్ తనువు చాలించాలన్న నిర్ణయం తీసుకున్నాడు. ఇంట్లోని ఓ గదిలో ఒకే ఫ్యానుకు ప్రేమికులిద్దరూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అరుణ్, అలేఖ్యల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రేమికుల ఆత్మహత్యతో చిత్యలపల్లి, భూపాలపట్నం గ్రామాలలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మార్చి 06 :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని మార్చి 1వ తేది నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు . శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పి సూచించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి...9 మంది అరెస్ట్

## - పరారీలో మరో 11 మంది

## - 3500/- నగదు,1,56,000రూపాయాల విలువగల కాయిన్స్,9 మొబైల్స్ స్వాధీనం



**ధర్మపురి (మన వెలుగు) మార్చి 06 :** ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్గపల్లి గ్రామ శివారులో గల మామిడితోట కేంద్రంగా ఇతర జిల్లాలు అనగా మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, రామగుండం నుండి 20 మంది వ్యక్తులు వచ్చి పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరం పై సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 3500 నగదు, 1,56,000 రూపాయల విలువ గల కాయిన్స్, 9 మొబైల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని ధర్మపురి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేయడం జరిగింది జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో అక్రమ,అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి,పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ సి.ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రమేశ్,కానిస్టేబుళ్లు వినోద్,రమేష్ మరియు ఖ్యుఆర్టి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ పై అత్యాచారం...

## ఆందోళనలో చేపట్టిన ఆశా వర్కర్లు



**రాయికల్ (మన వెలుగు) మార్చి 06 :** జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలోగల ఒడ్డె లింగాపూర్ గ్రామంలో ఓ ఆశ వర్కర్ తన విధులను ముగించుకొని తన సొంత గ్రామమైన రాయికలకు చేరుకోవడానికి సాయంత్రం వేళ రవాణా సౌకర్యం లేక బస్టాండ్ పరిధిలో వాహనాల కోసం ఎదురుచూస్తూ ఉండగా విషయం పసిగట్టిన మక్కల రాజు అనే కామాంధుడు సమయానికి వేచి చూసి గమ్యాన్ని చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేదంటూ నమ్మబలికి తన ద్విచక్ర వాహనం పైన భద్రంగా ఇంటికి చేరవేస్తానంటూ, సమయం గడుస్తున్నా కొద్దీ రాత్రి అవుతుంది అంటూ మాయ మాటలు, కల్లబొల్లి మాటలు చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని, ఊరు శివారులో గల మామిడి తోటలోకి లాక్కొని పోయి చంపేస్తానంటూ బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నంలో ఆశా వర్కర్ తప్పించుకునే ప్రయత్నం చేయగా వడివడిగా ఆ మహిళను చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. అటు పిమ్మట చంపే ప్రయత్నం చేయగా విషయం ఎవరికీ చెప్పను అంటూ బ్రతిమలాడగా ఆ దుండగుడు చంపకుండా వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయగా ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాకుటిన సంఘటన స్థలానికి చేరుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆశ వర్కర్ల ఆశాజ్యోతి జయలక్ష్మి : ఆశ వర్కర్లకు ఏ చిన్నపాటి సమస్య తలెత్తిన వెంటనే స్పందించి తన సమస్యగా భావించి సమస్య పరిష్కారానికై పాటుపడే నాయకురాలు విషయం తెలుసుకొని బాధిత మహిళ దళితురాలు కావడంతో నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ, జీవితం నష్టపోయిన ఆ మహిళకు ప్రభుత్వం తరఫున ప సొంతిల్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఆసుపత్రిలో వైద్యానికి ఖర్చులు భరించాలని, భవిష్యత్తు జీవనోపాధికి 20 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని, ఆశా వర్కర్ల భద్రతకు ప్రత్యేకంగా ఒక వాహనాన్ని కేటాయించి నిరంతరం వారి భద్రత విషయాలను గమనించుకుంటూ ఉండే సిబ్బంది తోడు ఉంచాలని డిమాండ్ చేశారు.

# మూడేళ్ల బాలుడి కిడ్నాప్



**నల్లగొండ (మన వెలుగు ) మార్చి 06 :** జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం సృష్టించింది. పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. నల్లగొండకు చెందిన అహ్మద్, షమీమున్నిసా బేగం దంపతులు కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉంటున్నారు. వీరికి మూడేళ్ల అబూ అనే బాలుడు ఉన్నాడు. చిన్నచిన్న కూలీ పనులు చేస్తూ.. ప్రభుత్వం అందించే ఐదు రూపాయల భోజనంతో పూట గడుపుకుంటున్నారు. ఈనెల 4వ తేదీన ఆస్పత్రి ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ప్రాంతంలో అబూ ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడు తల్లిదండ్రులు.. హాస్పిటల్ ఆవరణలో వెతికినా.. ఆచూకీ లభించలేదు. వెంటనే బాలుడు తల్లిదండ్రులు టూ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. హాస్పిటల్ ఆవరణలోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. ఈ ఫుటేజీలో నాలుగవ తేదీ మధ్యాహ్నం సమయంలో ఫోన్ మాట్లాడుకుంటూ హాస్పిటల్ ఆవరణలోకి ఓ దుండగుడు వచ్చాడు. అక్కడే ఆడుకుంటున్న అబూను ఎత్తుకెళ్లినట్లు ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. దీంతో ఆ దుండగుడుని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో దుండగుడిని పట్టుకొని బాలుడిని క్షేమంగా తీసుకువస్తామని పోలీసులు చెబుతున్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY




# బిలియనీర్లలో భారత్‌కు మూడో స్థానం




భారతదేశంలో మిలియనీర్లు, బిలియనీర్లు పెరుగుతున్నారని గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ 'నైట్ ఫ్రాంక్' నివేదిక వెల్లడించింది. మిలియనీర్ల పరంగా భారత్ నాలుగో స్థానంలో నిలిచినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ జాబితాలో అమెరికా, చైనా, జపాన్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. అలాగే అపర కుబేరుల జాబితాలో ఇండియా మూడో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. తొలి రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. మన దేశంలో 191 మంది బిలియనీర్లు ఉన్నట్లు వెల్లడించింది. అత్యంత ధనవంతులు.. కుబేరులు ఎక్కువగా పశ్చిమ దేశాల్లోనే ఉంటారని అందరూ అనుకుంటారు.. కానీ, ఇది అవాస్తవం..ఇప్పుడు మన భారత దేశంలోనూ మిలియనీర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే దేశంలో మిలియనీర్ల సంఖ్య 6 శాతం మేర పెరిగినట్టు గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఓ నివేదికలో వెల్లడించింది. బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం..2024లో భారతదేశ బిలియనీర్ జనాభా భారీగా పెరిగిందని ప్రకటించింది. కన్సల్టెంట్ తన 'ది వెల్త్ రిపోర్ట్ 2025'లో ఈ డేటాను వెల్లడించింది. భారతదేశం ఇప్పుడు 191 మంది బిలియనీర్లకు నిలయంగా ఉంది. వీరిలో 26 మంది గత సంవత్సరంలోనే ఈ జాబితాలో చేరారు. భారత దేశంలో ఇప్పుడు మొత్తం మిలియనీర్ల సంఖ్య 85,698కు చేరుకొన్నట్టుగా నైట్ ఫ్రాంక్ వివరించింది. సంపన్నులు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో టాప్-3లో మన దేశం కూడా ఉన్నట్టు 'నైట్ ఫ్రాంక్' నివేదిక వెల్లడించింది. కనీసం రూ. 8,500 కోట్ల కంటే ఎక్కువ సంపద కలిగినవారిని బిలియనీర్లుగా పిలుస్తారు. కాగా ప్రపంచంలోని మొత్తం కుబేరుల సంపద విలువ ఏకంగా రూ.1,275 లక్షల కోట్లకు చేరింది. ప్రపంచంలోని మొత్తం కుబేరుల సంపద విలువ ఏకంగా రూ.1,275 లక్షల కోట్లకు చేరిందని నివేదిక స్పష్టం చేసింది. దేశంలో 396 మంది కుబేరులతో ముంబై అగ్రస్థానంలో ఉండగా, 217 మందితో ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక, 104 మంది సంపన్నులతో హైదరాబాద్ ముచ్చటగా మూడో స్థానాన్ని దక్కించుకొన్నట్టు హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 నివేదికలో వెల్లడించింది. మొత్తంగా తెలంగాణలో 109 మంది, ఏపీలో 9 మంది సంపన్నులు ఉన్నట్టు నివేదిక వివరించింది. అలాగే, మన దేశంలో అత్యంత ధనిక కుటుంబాల జాబితాలో అంబానీ కుటుంబం 10.09 లక్షల కోట్లుతో మొదటి స్థానంలో ఉండగా, మిస్త్రీ కుటుంబం 3.25 లక్షల కోట్లుగా ఉంది. జిందాల్ కుటుంబం 2.43 లక్షల కోట్లు, బిర్లా కుటుంబం 1.99 లక్షల కోట్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతులుగా గుర్తింపు పొందారు.

# యూపీఐ ఖాతాదారులకు అలెర్ట్
## ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు




భారతదేశంలో నోట్ల రద్దు తర్వాత నగదు లావాదేవీలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీసీఐ ద్వారా యూపీఐ సేవలను పౌరులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ సమయంలోనే యూపీఐ సేవలను ప్రజలను ఆకర్షించాయి. చిన్న మొత్తాల చెల్లింపులకు చాలా మంది యూపీఐను వాడుతున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు యూపీఐ రూల్స్‌ను ఏప్రిల్ 1 నుంచి మార్చనున్నాయి. ఆ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవల విషయంలో కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకురానుంది. ముఖ్యంగా బ్యాంకులు డిస్‌కనెక్ట్ చేసిన, లేదా సరెండర్ చేసిన నంబర్‌లను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వారి జాబితాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. నంబర్ ఆధారిత యూపీఐ చెల్లింపుల్లో వినియోగదారు సౌలభ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కీలక అప్‌డేట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూలై 16, 2024న స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలకు అనుగుణంగా ఈ కొత్త నిబంధనను ఎన్‌పీసీఐ రూపొందించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు మొబైల్ నంబర్ రద్దు జాబితా తెలుసుకోవడానికి డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాలి. అలాగే కనీసం వారానికోసారి క్రమం తప్పకుండా వారి డేటాబేస్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. యూపీఐ నంబర్‌ను సీడింగ్ లేదా పోర్ట్ చేయడానికి యూపీఐ యాప్‌లు స్పష్టమైన ఆప్ట్-అవుట్ ఎంపికతో స్పష్టమైన యూజర్ యాక్సెప్‌టెన్సీ పొందాలి. యూపీట్క యాప్ తప్పుదారి పట్టించే/బలవంతపు సందేశాలు లేకుండా స్పష్టమైన కమ్యూనికేషన్‌ను అందించాల్సి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ లావాదేవీ సమయంలో లేదా సమయంలో యూజర్ యాక్సెప్టెన్సీను తీసుకోకూడదు. ఈ చర్యల కారణంగా యూపీఐ నంబర్ సీడింగ్ లేదా పోర్టింగ్ కమ్యూనికేషన్‌లు తప్పుడు కమ్యూనికేషన్‌ను తొలగించవచ్చు. ఈ నూతన మార్గదర్శకాలను బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ సంస్థలు మార్చి 31, 2025 లోపు పాటించాలని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. మార్చి 31, 2025 నాటికి అన్ని బ్యాంకులు, యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు ఈ కొత్త నియమాలను పాటించాలి. ఏప్రిల్ 1, 2025 నుంచి ఎన్‌పీసీఐతో వివరణాత్మక నెలవారీ నివేదికలను కూడా పంచుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్లకు లింక్ చేసిన యూపీఐ ఐడీలు, నెలకు క్రియాశీల ప్రత్యేక వినియోగదారుల వివరాలను వెల్లడించాలి. అలాగే అప్‌డేట్ చేసిన మొబైల్ నంబర్ వ్యవస్థను ఉపయోగించి నిర్వహించిన లావాదేవీల సంఖ్యను కూడా పేర్కొనాల్సి ఉంటుంది. అలాగే స్థానికంగా పరిష్కరించిన యూపీఐ నంబర్ ఆధారిత లావాదేవీల వివరాలను తెలపాల్సి ఉంటుంది. ఎన్‌పీసీఐ చర్యల కారణంగా బ్యాంకులు వారానికోసారి మొబైల్ నంబర్ రికార్డులను అప్‌డేట్ చేయాలి. ఇలా చేస్తే విఫలమైన లేదా తప్పుదారి పట్టించే లావాదేవీల ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# తాజ్‌మహల్‌ను మించిన అందాలు..
## ఢిల్లీలో మీరిప్పటివరకు చూడని ప్రదేశాలివి



తాజ్ మహల్‌ను చూడటానికి చాలా మంది ఆగ్రా వెళుంటారు. అయితే, ఈ పాలరాయి సమాధి కంటే ఆగ్రాలో ఇంకా చూడదగ్గ ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. కాలక్రమంలో వీటి వైభవం మరుగున పడింది. కానీ ఈ ప్రదేశాలు మీకు కచ్చితంగా మరుపురాని అనుభూతినిస్తాయి. ఢిల్లీ చరిత్రను చాటిచెప్తాయి. ఈ సారి ఆగ్రాను సందర్శించినప్పుడు కచ్చితంగా ఈ ప్రదేశాలను కూడా కవర్ చేయండి. ఢిల్లీ.. ప్రపంచవ్యాప్తంగా అందమైన, అధునాతనమైన, ఆహ్లాదకరమైన పట్టణ జీవనశైలికి ఇది పెట్టింది పేరు. సంస్కృతి మరియు చరిత్రకు కూడా ఈ ప్రదేశం ప్రసిద్ధి చెందింది. అనేక ప్రసిద్ధ స్మారక చిహ్నాలు, కోటలు, మ్యూజియంలు, ఉద్యానవనాలు మరెన్నో ఉన్న చరిత్ర ఢిల్లీకి ఉంది. రాజులు మరియు రాణుల గొప్పతనాన్ని చాటే కట్టడాలు ఇక్కడున్నాయి. అందులో ఒకటి తాజ్ మహల్ కానీ.. ఇదొక్కటే కాదు ఢిల్లీలో మీకు తెలియనివి.. మీరు చూడాల్సిన ప్రదేశాలు మరెన్నో ఉన్నాయి. మీరు మొదటిసారి ఢిల్లీని సందర్శిస్తున్న వారైనా లేదా వందోసారి సందర్శించే వారైనా, ఈ ఢిల్లీ చారిత్రక కట్టడాల గొప్పతనాన్ని చూడాల్సిందే.ఫతేపూర్ సిక్రీ.. ఆగ్రా నుండి 37 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫతేపూర్ సిక్రీ ఎర్ర ఇసుకరాయితో నిర్మించబడింది. ఈ పట్టణాన్ని మొఘల్ చక్రవర్తి అక్బర్ నిర్మించాడు. అతను దీనిని రాజధానిగా ప్లాన్ చేసుకున్నాడు. కానీ నీటి కొరత కారణంగా అతను నగరాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. దీని తరువాత 20 సంవత్సరాలలో, మొఘలుల రాజధాని లాహోర్‌కు మార్చబడింది. ఇలా ఒకప్పుడు మొఘల్ సామ్రాజ్యానికి రాజధానిగా ఉన్న ఫతేపూర్ సిక్రీ, అద్భుతమైన రాజభవనాలు, ప్రాంగణాలతో సందడిగా ఉండే బజార్లతో కూడిన ఒక అద్భుతమైన నిర్మాణంగా విలసిల్లింది.

# భారత్, చైనాపై ప్రతీకార టారిఫ్‌ల మోత



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్, చైనాతో సహా అనేక దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. దశాబ్దాలుగా ఇతర దేశాలు అమెరికాపై టారిఫ్‌లు విధిస్తున్నాయని, ఇప్పుడు తమ సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. భారత్ 100% కంటే ఎక్కువ ఆటో టారిఫ్‌లు విధించిందని ఆయన గుర్తుచేశారు. అమెరికా విధించబోయే టారిఫ్‌లు భారత, చైనా ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్, చైనా సహా పలు దేశాలపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాదుడుకు సిద్ధమయ్యారు. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తొలిసారి కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో ప్రసంగించిన ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రెండోసారి పదవి చేపట్టిన ఆరు వారాల్లో తాను చేసిన పనులు సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే పలు దేశాలపై విధిస్తున్న సుంకాలు గురించి ప్రస్తావించారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేస్తామని వెల్లడించడం సంచలనంగా మారింది. కొన్ని దేశాలు దశాబ్దాలుగా తమపై టారిఫ్‌లు విధిస్తున్నాయని, ఇప్పుడు తమ టైమ్ వచ్చిందని అన్నారు. ఐరోపా సమాఖ్య, చైనా, బ్రెజిల్, భారత్ లాంటి చాలా దేశాలు తమ నుంచి అధికంగా టారిఫ్‌లు వసూలు చేస్తున్నాయని, అందులోనూ భారత్ 100శాతానికి పైగా ఆటో టారిఫ్‌లు విధించిందని గుర్తు చేశారు. ప్రస్తుత వ్యవస్థలతో అమెరికాకు ఎక్కడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఏప్రిల్ 2 నుంచి ఆయా దేశాలపై తాము కూడా ప్రతీకార సుంకాలు విధిస్తామని స్పష్టం చేశారు. ఆయా దేశాలు ఎంత టారిఫ్‌లు విధిస్తే, అదే స్థాయిలో తామూ వసూలు చేస్తామని తెలిపారు. ప్రతీకార టారిఫ్‌లతో అమెరికా మరింత సంపన్న దేశంగా, గొప్ప దేశంగా మళ్లీ అవతరిస్తుందన్నారు డొనాల్డ్ ట్రంప్. వాస్తవానికి ఏప్రిల్ ఒకటి నుంచే అమలు చేయాలనుకున్నా, అలా చేస్తే మీమ్స్ బారిన పడాల్సి వస్తుందనే ఆలోచనతోనే ఏప్రిల్ 2 నుంచి వసూలు చేయనున్నట్లు ప్రకటించారు.

# రూ.1500 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్



పతంజలి సంస్థ నాగ్‌పూర్‌లో 800 టన్నుల పండ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల భారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. సిట్రస్ పండ్లు, ఇతర పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేసి, రసం, జ్యూస్ కాన్సెంట్రేట్, గుజ్జు వంటి ఉత్పత్తులను తయారు చేస్తుంది. టెట్రా ప్యాక్ ప్యాకేజింగ్‌తో, రసాయనాలు లేకుండా, ప్రీమియం క్వాలిటీతో నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భారీ ప్లాంట్ ను నిర్మించింది.పతంజలి త్వరలో నాగ్‌పూర్‌లో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రారంభించనుంది. ఈ ప్లాంట్ సిట్రస్ పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేయడం ద్వారా రసం, జ్యూస్ కాన్‌సెంట్రేట్, గుజ్జు, పేస్ట్, ప్యూరీలను ఉత్పత్తి చేస్తుంది. మిహాన్ (మల్టీ-మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్, విమానాశ్రయం)లోని పతంజలి మెగా ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ మార్చి 9న ప్రారంభం కానుంది. ఆరెంజ్ సిటీగా పిలువబడే నాగ్‌పూర్‌లో నారింజ, కిన్నో, స్వీట్ లైమ్, నిమ్మకాయ వంటి సిట్రస్ పండ్లు పుష్కలంగా లభిస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఒక సిట్రస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది పతంజలి సంస్థ. ఈ ప్లాంట్ రోజుకు 800 టన్నుల పండ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో నిర్మించారు. పూర్తిగా సహజమైన, ఎటువంటి అదనపు రసాయనాలు, లేదా చక్కెర ఉపయోగించకుండా ఇక్కడ ఫ్రుట్ జ్యూస్‌లు తయారు చేయనున్నారు. దీనితో పాటు, ఈ ప్లాంట్‌లో 600 టన్నుల ఉసిరి, 400 టన్నుల మామిడి, 200 టన్నుల జామ, 200 టన్నుల బొప్పాయి, 200 టన్నుల ఆపిల్, 200 టన్నుల దానిమ్మ, 200 టన్నుల స్ట్రాబెర్రీ, 200 టన్నుల ప్లం, 200 టన్నుల బేరి, 400 టన్నుల టమోటా, 400 టన్నుల బాటిల్ సొరకాయ, 400 టన్నుల కాకరకాయ, 160 టన్నుల క్యారెట్, 100 టన్నుల కలబంద వంటి పండ్లను కూడా ప్రాసెస్ చేస్తారు. ప్రపంచ ప్రమాణాల ప్రకారం రసం, రసం గాఢత, గుజ్జు, పేస్ట్, పురీని ఉత్పత్తి చేయడానికి ప్రతిరోజూ వీటిని ప్రాసెస్ చేస్తారు. పండ్ల నుండి నేరుగా ప్రాసెస్ చేసే ప్రక్రియను ప్రాథమిక ప్రాసెసింగ్ అంటారు. అలాగే నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో టెట్రా ప్యాక్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, టెట్రా ప్యాక్ ప్యాకేజింగ్‌లో ఎలాంటి ప్రిజర్వేటివ్‌లు లేదా చక్కెరను ఉపయోగించకుండా ప్రీమియం విభాగంలో ఉత్పత్తులను అందించనున్నారు.

# సమ్మర్‌లో ఈ టిప్స్ పాటిస్తే కరెంటు
## బిల్లు సగానికి సగం ఆదా..



ఎండాకాలం అప్పుడే మొదలైంది. దీంతో ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు గ్యాప్ లేకుండా వాడేస్తుంటారు. వీటి వల్ల కరెంటు బిల్లు తడిసి మోపెడవుతుంది. ఎంత ప్రయత్నించినా ఈ బిల్లుల మోత తగ్గించడం ఓ పట్టాన సాధ్యం కాదు. అందుకే ఈ ఎండాకాలంలో మీ కరెంటు బిల్లును ఇలాంటి చిట్కాలు పాటించి సగానికి సగం ఆదా చేసుకోవచ్చు. టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ కరెంటు వినియోగం కూడా రెంట్టింపవుతోంది. టెక్నాలజీ ఎంత పెరిగితే అంత ఎలక్ట్రానిక్ ఐటమ్స్ తో కరెంటు బిల్లు భారం పడుతుంది. ఇప్పుడింక ప్రతి ఇంట్లో ఒకరికి సెల్ ఫోన్ కామన్ ఐపోయింది. దానికి తోడు వైఫై లు టీవీ రూటర్లు, లాప్ ట్యాప్‌లు, ట్యాబ్లేట్లు ఇలా ఎటు చూసిన ఎలక్ట్రానిక్ వస్తువులతో ఇల్లు ఓ మ్యూజియంలా కనిపిస్తుంటుంది. దీని సంగతి ఎలా ఉన్నా ఎండాకాలంలో మాత్రం వీటి వాడకాన్ని అదుపు చేయకుంటే మీ జేబుకు చిల్లు తప్పదు. మీ ఇంట్లో నాన్ స్టాప్ గా ఫ్యాన్ ను వినియోగిస్తున్నారా..? అయితే ఈ సారి ఫ్యాన్ కొనేముందు ఈ టిప్స్ పాటించండి. బీఎల్‌డీసీ టెక్నాలజీతో తయారు చేసిన ఫ్యాన్లను వాడండి. వీటి వాడకంతో విద్యుత్తు వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. రెగ్యులేటర్లు పనిచేయకుండా ఉంటే వెంటనే మార్పించుకోండి. ఎందుకంటే ఫ్యాన్ ఫుల్ స్పీడుతో తిరిగితే బిల్లు అధికంగా వస్తుంది. 1 లేదా 2 వేగంతో తిరిగితే విద్యుత్తు ఆదా అవుతుంది. ఫ్యాన్ తరచూ శబ్దం చేస్తున్నా కూడా దాని మోటార్ లోడ్ ఎక్కువైందని అర్థం.. అది కరెంటు బిల్లును పెంచుతుంది. ఏసీలు కొనేవారు డిజైన్, ధర, కంపెనీతో పాటు చూడాల్సిన ముఖ్యమైన అంశం దాని స్టార్ రేటింగ్. 3 స్టార్ ఏసీలకు బదులుగా 5 స్టార్ ఏసీలనే ఎంచుకోండి. ఎప్పటికప్పుడు ఏసీ ఫిల్టర్లు క్లీన్ చేస్తుండాలి. ఏసీ సెట్టింగ్ ను 24 సెంటిగ్రేడ్ డిగ్రీల కన్నా ఎక్కువుండేలా చూసుకోవడం మంచిది. కరెంటు బిల్లు ఆదా చేయాలనుకునే వారు ముందుగా చేయాల్సిన పని మీ బల్బులను మార్చడమే. ఎందుకంటే ఫిలమెంట్ ఉన్న బల్బులు ఎక్కువ కరెంటును తీసుకుంటాయి. దానికి బదులుగా ఎల్‌ఈడీ బల్బులతో వాటిని రీప్లేస్ చేయండి. కరెంటు ఆదా చేయడంలో ఇవెంతో ముఖ్యం. 60 వాట్ల ఫిలమెంటు బల్బు ఇచ్చే వెలుగును కేవలం 9 వాట్స్ ఎల్‌ఈడీ బల్బు ఇస్తుంది. ఫ్రిజ్ విషయంలో చాలా మంది చేసే పొరపాటు ఇది.. సమ్మర్ లో చల్లదనం కోసం అవసరం లేకపోయినా ఫ్రిడ్జ్ డోర్ తీయడం దాని ముందు కాసేపు రిలాక్స్ అయ్యేందుకు చూస్తుంటారు. ఇలా చేయడం వల్ల మీరు అరగంట కూలింగ్ ను వేస్ట్ చేసినట్టే . అందుకే సాధ్యమైనంత తొందరగా ఫ్రిడ్జ్ డోర్ ను మూసివేయండి. అవసరం అయితే తప్ప ఎక్కువగా డోర్ తెరవకండి. మరీ ముఖ్యంగా ఫ్రిడ్జ్ వెనక భాగాన్ని గోడకు మరీ టైట్ గా ఆణించడం వల్ల కూడా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. గాలి బాగా తగిలి చల్లగా ఉండే చోట ఫ్రిడ్జ్ ను ఉంచేలా ప్లాన్ చేసుకోవాలి.

# భారత్ దెబ్బకు ఖాళీగా మారిన స్టేడియాలు





ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ పాకిస్థాన్ జట్టుకు, ౹ాజదీ కు తీవ్ర నిరాశను మిగిల్చింది. లీగ్ దశలోనే నిష్క్రమించిన పాక్ జట్టుతో స్టేడియాల్లో ప్రేక్షకుల రాక తగ్గి, టోర్నీ నిర్వహణ భారంగా మారింది. వర్షం కారణంగా మూడు కీలక మ్యాచ్‌లు రద్దవ్వడంతో ప్రసారదారులు, స్పాన్సర్లు నష్టపోయి ౹ాజదీ పై ఒత్తిడి పెంచారు. అంతేకాదు, భారత్ ఫైనల్‌కు చేరడంతో లాహోర్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహించే అవకాశం కూడా కోల్పోవడం పాక్ అభిమానులను తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కు ఆతిథ్యమిచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారీ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. లీగ్ దశలో ఒక్క విజయం కూడా సాధించకుండానే పాకిస్థాన్ జట్టు టోర్నమెంట్ నుండి నిష్క్రమించడంతో, టోర్నీ నిర్వహణ ౹ాజదీ కి భారం అయింది. ముఖ్యంగా, పాకిస్థాన్ జట్టు లేకుండా జరుగుతున్న మ్యాచ్‌లకు ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో, సౌతాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్ సెమీ ఫైనల్‌కు ప్రేక్షకులను ఆకర్షించేందుకు ౹ాజదీ ఓ వినూత్న ఆఫర్ ప్రకటించింది. మ్యాచ్‌కు హాజరయ్యే ప్రేక్షకులకు ఇఫ్తార్ విందును అందజేయాలని నిర్ణయించింది. ఇందులో డేట్స్, జ్యూస్, మినీ పిజ్జా వంటి తినుబండారాలను ఉంచారు. ప్రస్తుతం రంజాన్ ఉపవాస సమయం కావడంతో, ఈ నిర్ణయం తీసుకున్న ౹ాజదీ , వీటిని సాయంత్రం 6 గంటలకు మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులకు అందజేసింది. అయితే, ఈ వ్యూహంతోనూ స్టేడియానికి ప్రేక్షకుల రాక ఆశించిన స్థాయిలో లేకపోవడం ౹ాజదీ కి మరో ఎదురుదెబ్బగా మారింది. మరోవైపు, టీమిండియా ఫైనల్‌కు చేరడంతో, తుది పోరును దుబాయ్‌లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ పాకిస్థాన్‌లో ఆడడానికి అంగీకరించకపోవడంతో టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, లీగ్ దశలోనే పాకిస్థాన్ నిష్క్రమించడంతో పాటు, భారత్ ఫైనల్‌కు చేరడం పాక్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. టీమిండియా కాకుండా మరో జట్టు ఫైనల్ చేరి ఉంటే, లాహోర్‌లో ఫైనల్‌ను నిర్వహించే అవకాశం ఉండేది. కానీ, 29 ఏళ్ల తర్వాత తమ దేశంలో జరుగుతున్న ఐసీసీ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించుకునే అవకాశాన్ని కూడా పాక్ కోల్పోయింది. ఇక మరో ప్రధాన సమస్య, లీగ్ దశలో మూడు కీలక మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దవ్వడం. దీని వల్ల బ్రాడ్‌కాస్టర్లకు భారీ నష్టాలు వాటిల్లాయి. స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు తమ నష్టపరిహారాన్ని చెల్లించాలని ౹ాజదీ పై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణ పాక్ క్రికెట్ బోర్డుకు మరింత ఆర్థిక సమస్యలను తెచ్చిపెట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.ఈ టోర్నమెంట్ ద్వారా భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని భావించిన ౹ాజదీ , పాకిస్థాన్ జట్టు ముందడుగు వేసి కనీసం సెమీ ఫైనల్ చేరుతుందనే నమ్మకంతో ఉంది. అయితే, అనూహ్యంగా జట్టు ప్రదర్శన తీవ్రంగా నిరాశపరచడంతో వారి వ్యూహాలు తలకిందులయ్యాయి. ప్రత్యేకంగా, భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓటమి అనంతరం అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టేడియంలలో భారీగా ఖాళీలు ఉండటమే కాకుండా, టిక్కెట్ల అమ్మకాలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో ఇదొక అతి పెద్ద నిరాశగా నిలిచింది.

# టేబుల్ టెన్నిస్‌కు శరత్ కమల్ గుడ్‌బై



భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆటగాడు ఆచంట శరత్ కమల్ త్వరలో టిటి క్రీడకు గుడ్‌బై చెప్పనున్నాడు. ఈనెలలో చెన్నైలో జరిగే డబ్ల్యుటిటి టోర్నీ అనంతరం టేబుల్ టెన్నిస్ ఆటనుంచి వైదొలగనున్నట్లు బుధవారం ప్రకటించాడు. 1999లో చెన్నై వేదికగా జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్స్‌లో వెలుగులోకి వచ్చిన 42ఏళ్ల శరత్ కమల్.. రెండు దశాబ్దాల అనంతరం మళ్లీ అదే ప్రదేశంలో తన ఆట నుంచి వైదొలగనున్నట్లు తెలిపాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో 13పతకాలు సాధించిన శరత్ కమల్.. అందులో 7స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లాసియా క్రీడల్లో భారత టిటిజట్టు చారిత్రాత్మక కాంస్య పతకం చేజిక్కించుకోవడంలో శరత్ కమల్ కీలకపాత్ర పోషించాడు. మనిక బత్రాతో కలిసి మిక్స్‌డ్ విభాగంలో మరో కాంస్య పతకాన్ని సాధించాడు. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించిన శరత్ కమల్ ఐదుసార్లు ఒలింపిక్స్‌కు ఎంపికైన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

# ఎట్టకేలకు నష్టాలకు తెర




రిలీఫ్ ర్యాలీతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ మంచి లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 వద్ద, నిఫ్టీ 254.65 పాయింట్ల లాభంతో 22,337.30 వద్ద ముగిశాయి. దీంతో గత పది రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్ పడింది. ఈ రిలీఫ్ ర్యాలీతో బీఎసఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బుధవారం రూ.7.97 లక్షల కోట్లు పెరిగి రూ.393.04 లక్షల కోట్లకు చేరింది. యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం, కమోడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు పెద్ద ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మంచి లాభాలతో ట్రేడవడంబీ మెక్సికో, కెనడాలపై విధించిన సుంకాలపై అమెరికా పునరాలోచిస్తోందన్న వార్తలు ఇందుకు తోడయ్యాయి. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు బలహీనపడడం కూడా ఇందుకు కలిసొచ్చింది. అయితే ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దీర్ఘకాలిక ప్రభావంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీంతో ఈ రిలీఫ్ ర్యాలీ ఎన్నాళ్లు కొనసాగుతుందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైసూరు కేంద్రంగా పనిచేసే ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ కంపెనీ రూ.700 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఇందు కోసం ఇప్పటికే సెబీకి దరఖాస్తు చేసింది. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫఎస్) ద్వారా రూ.490 కోట్లు సమీకరించనున్నట్టు తెలిపింది. కొత్త షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను కం పెనీ అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్టు తెలిపింది.

# ద్విచక్ర వాహన రుణాల్లో మందగింపు

ఆర్థిక వ్యవస్థ ప్రగతి తీరుకు అద్దం పట్టే వాహన పరిశ్రమ అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొంటుంది. దీంతో ముఖ్యంగా ద్విచక్ర వాహన రంగ రుణాలు మందిగిస్తున్నాయని విత్త సంస్థల వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే ప్రాథమిక స్థాయి ద్విచక్ర వాహన పరిశ్రమ మరింత ఒత్తిడిని ఎదుర్కొంటుంది. మరోవైపు రుణాలపై కొనుగోలు చేసిన వారు చెల్లింపులు చేయలేక విఫలం అవుతున్నారు. ఆదాయాలు సన్నగిల్లడమే ఇందుకు ప్రధాన కారణం. దాదాపు 75 శాతం ద్విచక్ర వాహనాలు రుణాలపైనే విక్రయించ బడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ద్విచక్ర వాహన అమ్మకాలు 6 శాతం తగ్గి 13.5 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. తీసుకున్న రుణాలు చెల్లించలేకపోవడం, కొత్త అమ్మకాలు లేకపోవడం ఫైనాన్స్ రంగంలోని విత్త సంస్థలను బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ చివరి నాటికి 1.50 లక్షల కోట్ల ద్విచక్ర వాహన రుణ బకాయిలు పేరుకుపోయాయి. ఇంతక్రితం ఏడాది నాటికి ఈ సంఖ్య 1.19 లక్షల కోట్లుగా ఉంది. పెరుగుతున్న లోన్ డిఫాల్ట్‌లను అరికట్టడానికి 2019 తర్వాత మొదటిసారిగా రుణం ఇవ్వడంపై ద్విచక్ర వాహన ఫైనాన్షియర్లు వెనక్కి తగ్గుతున్నారు. ఇచ్చినప్పటికీ రుణ కాలపరిమితిని తగ్గిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమ రుణాల చెల్లింపులు వైఫల్యాలు 150 బేసిస్ పాయింట్లు పెరిగాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అఖిలేష్ రారు పేర్కొన్నారు. తమ బ్యాంక్‌లో డిఫాల్ట్‌లు తులనాత్మకంగా 10-15 బేసిస్ పాయింట్లు పెరిగాయన్నారు. ద్విచక్ర వాహన ఫైనాన్సింగ్ విభాగంలో పెరుగుతున్న ఒత్తిడిని గమనిస్తున్నామని మరో బ్యాంక్ అధికారి పేర్కొన్నారు.

# డేవిడ్ మిల్లర్ షాకింగ్ కామెంట్స్




2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ-ఫైనల్లో దక్షిణాఫ్రికా జట్టు న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. దీంతో ఫైనల్ ఆడే కలను మరోసారి నెరవేర్చుకోకుండానే ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో డేవిడ్ మిల్లర్ విమర్శలు గుప్పించాడు. టీమిండియాతోపాటు, ఐసీసీకి గట్టిగానే ఇచ్చి పడేశాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి లీగ్ దశ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా దక్షిణాఫ్రికా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో సెమీఫైనల్‌కు చేరుకుంది. అప్పటి వరకు పాకిస్తాన్‌లో ఆడిన సౌతాఫ్రికా జట్టు.. ఆ తర్వాత, టీమిండియాతో సెమీ-ఫైనల్ మ్యాచ్‌ను ఆడాల్సి వస్తుందేమోనని ప్రాక్టీస్ చేయడానికి దుబాయ్ వెళ్ళింది. ఎందుకంటే, టీమిండియా తన మ్యాచ్‌లను కేవలం దుబాయ్‌లోనే ఆడుతోంది. సౌతాఫ్రితాపాటు ఆస్ట్రేలియా జట్టు కూడా పాకిస్తాన్ నుంచి దుబాయ్ వెళ్లాల్సి వచ్చింది. కానీ, దుబాయ్ మైదానంలో టీం ఇండియా న్యూజిలాండ్‌ను ఓడించడంతో ఆస్ట్రేలియా జట్టు దుబాయ్‌లోనే ఉండిపోయింది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా రెండవ సెమీ-ఫైనల్ ఆడటానికి పాకిస్తాన్‌లోని లాహోర్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. ఇలా పాక్ నుంచి దుబాయ్‌కి, మరలా దుబాయ్ నుంచి పాకిస్తాన్‌కు తిరిగాల్సి రావడంతో డేవిడ్ మిల్లర్ విచారం వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్ జట్టుతో జరిగిన రెండవ సెమీస్‌లో సౌతాఫ్రికా ఓడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో కేవలం భారత జట్టు వల్లే ఓడిపోయామనేలా డేవిడ్ మిల్లర్ తన బాధను వ్యక్తం చేశాడు. సెమీ-ఫైనల్లో దక్షిణాఫ్రికా తరపున డేవిడ్ మిల్లర్ సెంచరీ చేశాడు. కానీ అతని జట్టు 362 పరుగుల ఛేదనలో 312 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో 50 పరుగుల తేడాతో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ తరువాత ఐసీసీ షెడ్యూల్ గురించి మిల్లర్ మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి (పాకిస్తాన్ కు) కేవలం గంటా 40 నిమిషాల విమాన ప్రయాణం. మ్యాచ్ ఆడిన తర్వాత, మేం మరుసటి రోజు తెల్లవారుజామున దుబాయ్‌కి విమానంలో బయలుదేరాం. అక్కడికి వెళ్ళిన తర్వాత, మరుసటి రోజు ఉదయం విమానంలో పాకిస్తాన్‌కు తిరిగి వచ్చాం. మేం విమానంలో ఐదు గంటలు గడిపినట్లు కాదు. కోలుకోవడానికి మాకు తగినంత సమయం లేదు. దాంతో మాకు తగినంత ప్రాక్టీస్ చేసేంత సమయం కూడా లేకుండా పోయింది' అంటూ విమర్శలు గుప్పించాడు. 50 పరుగుల తేడాతో ఓటమిపై మిల్లర్ మాట్లాడుతూ.. మేం నిజంగా బాగా ఆడాం. మా పునాది చాలా బాగుంది. దురదృష్టవశాత్తు మేం మధ్య ఓవర్లలో చాలా వికెట్లు కోల్పోయాం. చివరికి ఇది ఒక జట్టు కృషి. అందరూ తమ శక్తి మేరకు కృషి చేయడానికి ప్రయత్నించారు. మళ్ళీ భారత్‌తో ఆడితే బాగుండేది. ట్రోఫీ గెలవాలంటే చాలా కష్టపడాలి' అంటూ తెలిపాడు.

# దటీజ్ టీమిండియా..ఫైనల్ మ్యాచ్‌కు ఫుల్ డిమాండ్



ఎట్టకేలకు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ చివరి పోరుకు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో తలపడేందుకు భారత్, న్యూజిలాండ్ జట్లు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో టిక్కెట్ రేట్లకు రెక్కలు వచ్చాయి. ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను పీసీబీ క్యాష్ చేసుకోవాలని భారీగా ప్లాన్ చేస్తోంది. దీంతో టిక్కెట్ల రేట్లతో ఫ్యాన్స్‌కు షాకిస్తోంది.భారత క్రికెట్ జట్టు ఎప్పుడు, ఎక్కడ ఆడినా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులకు ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. తాజాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడుతోన్న రోహిత్ సేన.. టైటిల్ దిశగా ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ, ఫైనల్ వరకు చేరుకుంది. ఇక ఆదివారం నాడు ట్రోఫీ పోరులో న్యూజిలాండ్ జట్టుతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. రోహిత్ శర్మ సేన మరో ఐసీసీ టైటిల్‌ను సాధించే దిశగా అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. ఈ క్రమంలో దుబాయ్‌లో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు టిక్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే, ధరలు మాత్రం సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఫైనల్ జరగనుంది . ఇప్పటికే 25,000 టిక్కెట్లు అమ్ముడయ్యాయి. టిక్కెట్ ధరలు సుమారుగా రూ. 6000 నుంచి గరిష్టంగా రూ. 283,000 వరకు ఉన్నాయంట. టీమిండియా ఫైనల్ చేరుకోవడంతో టిక్కెట్లకు విపరీతంగా డిమాండ్ ఏర్పడడంతో.. ధరలు కూడా అదే స్థాయిలో నిర్ణయించినట్లు పీసీబీ ప్రకటించింది.

# ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ..ఫైనల్లో

## భారత్‌తో తలపడేది న్యూజిలాండే





363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు శుభారంభం లభించలేదు. ర్యాన్ రికెల్టన్ కేవలం 17 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. దీని తర్వాత కెప్టెన్ టెంబా బావుమా, రాస్సీ వాన్ డెర్ డుసెన్ రెండో వికెట్‌కు 105 పరుగులు జోడించారు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌కు న్యూజిలాండ్ టిక్కెట్‌ను బుక్ చేసుకుంది. మిచెల్ సాంట్నర్ నేతృత్వంలోని కివీస్ జట్టు ఇప్పుడు లాహోర్ నుండి దుబాయ్‌కి విమానంలో బయలుదేరుతుంది. ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి స్కోరు బోర్డులో 362 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్ సెంచరీలు సాధించగా, చివరి ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ తన పేలుడు బ్యాటింగ్‌తో రాణించాడు. 363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు 9 వికెట్లు కోల్పోయి 312 పరుగులు మాత్రమే చేయగలిగింది. డేవిడ్ మిల్లర్ సెంచరీ కూడా ప్రోటీస్ జట్టుకు సహాయం చేయలేకపోయింది. 363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు శుభారంభం లభించలేదు. ర్యాన్ రికెల్టన్ కేవలం 17 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. దీని తర్వాత కెప్టెన్ టెంబా బావుమా, రాస్సీ వాన్ డెర్ డుసెన్ రెండో వికెట్‌కు 105 పరుగులు జోడించారు. బావుమా 71 బంతుల్లో 56 పరుగులు చేసిన తర్వాత సాంట్నర్‌కు వికెట్ ఇచ్చాడు. కాగా రాసి డుసెన్ 69 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆడమ్ మార్క్రామ్ శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేక 31 పరుగులు చేసిన తర్వాత రచిన్ రవీంద్ర స్పిన్‌లో చిక్కుకున్నాడు. క్లాసన్ బ్యాట్‌తో ప్రత్యేకంగా ఏమీ చూపించలేక 3 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు.చివరి ఓవర్లలో డేవిడ్ మిల్లర్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 67 బంతుల్లో 100 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. బౌలింగ్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 43 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. కాగా, మాట్ హెన్రీ తన పేరిట రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు శుభారంభం లభించలేదు. విల్ యంగ్ 21 పరుగులు మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. దీని తర్వాత కేన్ విలియమ్సన్, రచిన్ రవీంద్రలు బాధ్యతలు స్వీకరించి మైదానంలోని నాలుగు మూలల్లో ఒకదాని తర్వాత ఒకటి శక్తివంతమైన షాట్లు కొట్టారు. రచిన్-విలియమ్సన్ రెండో వికెట్‌కు 164 పరుగులు జోడించారు. రచిన్ 101 బంతుల్లో 108 పరుగులు చేసి అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కాగా, విలియమ్సన్ 94 బంతుల్లో 102 పరుగులు చేశాడు. డారిల్ మిచెల్ కూడా ఫామ్‌లో కనిపించి 49 పరుగులు చేశాడు. చివరి ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ ధాటిగా ఆడి కేవలం 27 బంతుల్లో 49 పరుగులు చేశాడు. 181 స్ట్రైక్ రేట్‌తో ఆడిన ఫిలిప్స్ ఆరు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. దీని కారణంగా న్యూజిలాండ్ జట్టు స్కోరు బోర్డుపై 50 ఓవర్లలో 362 పరుగులు చేయడంలో విజయం సాధించింది. ఇప్పుడు మార్చి 9న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే టైటిల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ టీమ్ ఇండియాతో తలపడనుంది.

# మోహన్ లాల్ సినిమాకు పోటీ కష్టాలు



మలయాళం బ్లాక్ బస్టర్ లూసిఫర్ కొనసాగింపుగా వస్తున్న ఎల్2 ఎంపురాన్ ఈ నెల 27 విడుదలకు రెడీ అవుతోంది. కేరళలో భారీ బిజినెస్ జరుపుకుంటున్న ఈ యాక్షన్ డ్రామాకు ఇతర భాషల్లో పోటీ వల్ల చిక్కులు తప్పడం లేదు. ముఖ్యంగా తెలుగు సంగతి చూస్తే మార్చి 28 నితిన్ రాబిన్ హుడ్, సితార మ్యాడ్ స్క్వేర్ ఒకే రోజు వస్తున్నాయి. బలమైన డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ వల్ల రెండింటికి సరిపడా థియేటర్లకు ఇప్పటి నుంచే అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఇంకోవైపు ఓ రెండు రోజులు అటుఇటు సల్మాన్ ఖాన్ సికందర్ వస్తుంది. దానికి మల్టీప్లెక్సుల కేటాయింపులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చాలవన్నట్టు విక్రమ్ వీరధీర శూరన్ పార్ట్ 2 అదే మార్చి ఇరవై ఏడున దిగుతోంది. మోహన్ లాల్ తో పోల్చుకుంటే టాలీవుడ్ లో విక్రమ్ కే మార్కెట్ ఎక్కువ. సో ప్రాథమిక మద్దతు చియాన్ కే ఉంటుంది. అయితే ఎల్2 ఎంపురాన్ దర్శకుడు పృథ్విరాజ్ సుకుమారన్ తెలుగు ప్రమోషన్, డిస్ట్రిబ్యూషన్ ని తేలిగ్గా తీసుకోవడం లేదట. సలార్, ఎస్ఎస్ఎంబి 29 నటుడిగా తనకు పెరిగిన పాపులారిటీని వాడుకుంటూనే వీలైనంత పబ్లిసిటీ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడని సమాచారం. మైత్రి లేదా ఆసియన్ సురేష్ ఎవరో ఒకరు పంపిణి పరంగా సపోర్ట్ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని సమాచారం. ఇవన్నీ ఎలా ఉన్నా ఎల్2కి మన దగ్గర పెద్దగా బజ్ లేదు. ఎందుకంటే లూసిఫర్ డబ్బింగ్ వెర్షన్ తొలినాళ్లలో ఏపీ, తెలంగాణలో పెద్దగా ఆడలేదు. దాన్నే చిరంజీవి గాడ్ ఫాదర్ గా రీమేక్ చేస్తే యావరేజ్ అయ్యింది. సో ఎల్2 కోసం ఎదురు చూస్తున్న జనాల సంఖ్య తక్కువే.

# మా అమ్మ గురించి అలా రాయొద్దు



మా అమ్మ గురించి అలా ఊహాజనిత వార్తలు రాయొద్దు. ప్రచారం చేయొద్దు' అని ప్రముఖ గాయని కల్పన కుమార్తె.. మీడియాకు విన్నవించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్పనను అంటిపెట్టుకునే ఉన్నట్టు ఆమె తెలిపారు. అమ్మ ఆరోగ్యం నిలకడగానే ఉంది. దీనిపై అపోహలు ప్రబలేలా మీడియా వ్యవహరించడం సరికాదు. అని ఆమె పేర్కొన్నారు. అంతేకాదు.. తన తల్లి ఆత్మహత్యా యత్నం చేయలేదని ఆమె స్పష్టం చేసింది. మా అమ్మ ఆత్మహత్య చేసుకునేందుకు పిరికి మనస్తత్వంతో లేదు. ఆమె చాలా ధ్రుఢంగా ఉన్నారు. ప్రశాంతత కోసం.. వేసుకునే నిద్రమాత్రల డోస్ కొంచెం ఎక్కువైంది. దీనిపై లేని పోని ప్రచారం చేయడం దారుణం. మా నాన్న-అమ్మ సంతోషంగానే ఉన్నారు. వారి మధ్య ఎలాంటి కలతలు లేవు. కానీ, మీడియాలో ప్రచారం అవుతున్నది వాస్తవం కాదు. ఇలాంటివాటిని ఆపేయండి అని కల్పన కుమార్తె మీడియాకు విజ్ఞప్తి చేశారు. కాగా.. కల్పన దక్షిణాదిలోనే కాకుండా.. ఖవ్వాలీ వంటి ఉత్తరాది సంగీతంలోనూ పేరు తెచ్చుకున్నారు. పంజాబీలోనూ ఆమె చేసే సంకీర్తనలకు ఆయా రాష్ట్రాల్లో మంచిపేరుంది. తాజాగా ఆమె నిద్రమాత్రలు వేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెకు స్థానికంగా ఓ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే.. ఈ విషయంపై భిన్నమైన వాదనలు, కథనాలు వెలుగు చూశాయి. కుమార్తెతో ఉన్న విబేదాల కారణంగానే కల్పన ఆత్మహత్యా యత్నం చేశారన్నదిఒకటైతే.. ఆర్థిక సమస్యలు, భర్తతో ఉన్న విభేదాలే కారణమని మరో ప్రచారం ఉంది.

# ఆ పేరు కంఫర్ట్‌గా ఉండదు



దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటి నయనతార. ఆమెను అభిమానులు 'లేడీ సూపర్‌స్టార్' అని పిలుచుకుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియా వేదికగా ఈ బిరుదుపై ఒక నోట్‌ను విడుదల చేశారు. 'నా అభిమానులు ఎంతో ప్రేమతో నన్ను 'లేడీ సూపర్ స్టార్' అని పిలవడం ఆనందంగా ఉంది. కానీ నాకు నయనతార పేరే హృదయానికి దగ్గరైంది. ఆ పేరు నటిగానే కాకుండా వ్యక్తిగానూ నేనేంటో తెలియజేస్తుంది. నా జీవితం తెరిచిన పుస్తకం. నా విజయాల్లో, కష్ట సమయంలో మీరంతా అండగా ఉన్నారు. మీరెంతో ప్రేమతో ఇచ్చిన ఈ 'లేడీ సూపర్ స్టార్' బిరుదుకు నేను రుణపడి ఉంటా. కానీ, నయనతార అని పిలిస్తేనే నాకు ఆనందం. బిరుదులు వెలకట్టలేనివి. కానీ, వాటివల్ల కంఫర్ట్‌గా ఉండలేని పరిస్థితి ఉంటుంది. సినిమా మనందరినీ ఐక్యంగా ఉంచుతుంది. దాన్ని ఎప్పుడూ సెలబ్రేట్ చేసుకుందాం' అని నయనతార పేర్కొన్నారు.

# యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా సంతాన ప్రాప్తిరస్తు. ఈ సినిమాను మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా ఏబీసీడీ సినిమా, రాజ్ తరుణ్ తో 'అహ నా పెళ్లంట' అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా టీజర్‌ను స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ "టీజర్ చాలా బాగుంది. 'సంతాన ప్రాప్తిరస్తు' మంచి ఎంటర్‌టైనింగ్ మూవీలా అనిపిస్తోంది. అన్ని సీన్స్ నవ్వించాయి. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా"అని అన్నారు.

# దేవర 2 ప్లానింగ్ ఎక్కడిదాకా వచ్చిందంటే



గత ఏడాది సెప్టెంబర్ లో విడుదలై బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న దేవరకు కొనసాగింపుకి రంగం సిద్ధమవుతోంది. ఇన్ సైడ్ రిపోర్ట్స్ ప్రకారం దర్శకుడు కొరటాల శివ బృందం గత మూడు నెలలుగా ఆ పని మీదే ఉంది. అసలైన కథ ఇందులోనే ఉంటుందనే తరహాలో ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్ ని ముగించడంతో సీక్వెల్ మీద అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా ఎన్నో ప్రశ్నలకు సమాధానం పార్ట్ 2లోనే చెప్పాల్సి ఉంటుంది. దీనికి టైం పట్టేలా ఉంది కాబట్టి కొరటాల వేరే హీరోతో ఇంకో సినిమా చేస్తాడనే పుకార్లు వచ్చిన నేపథ్యంలో అవేవీ నిజం కాదని తెలిసింది. ఆయన ఫోకస్ మొత్తం దేవర 2 మీదే ఉంది. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే వార్ 2 చివరి దశలో ఉంది. హృతిక్ రోషన్ తో కలిసి చేయాల్సిన పాట షూట్ ఇటీవలే మొదలయ్యింది. ఇంకో వారం రోజుల్లో అయిపోతుంది. చిన్న ప్యాచ్ వర్క్ మినహా దాదాపు పూర్తయినట్టే. ప్రశాంత్ నీల్ డ్రాగన్ సెట్లో ఏప్రిల్ నుంచి రెగ్యులర్ గా అందుబాటులో ఉండబోతున్నాడు. ఇది అక్టోబర్ లేదా నవంబర్ లోగా పూర్తి చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నారు. ఆలా చేస్తేనే 2026 సంక్రాంతి విడుదల సాధ్యమవుతుంది. ఎట్టి పరిస్థితుల్లో మిస్ కాకూడదనేది మైత్రి మూవీ మేకర్స్ లక్ష్యం. ఇవి అయిపోతే తారక్ చేతిలో కొత్త కమిట్ మెంట్స్ లేవు. సో దేవర 2కి మార్గం సుగమం అవుతుంది. ఈ సంవత్సరం చివర్లో లేదా జనవరి నుంచి షూటింగ్ కి వెళ్లిపోవచ్చు. బడ్జెట్ కూడా భారీగా పెంచబోతున్నారు. ఈసారి విలన్ సైఫ్ అలీ ఖాన్ తో పాటు బాబీ డియోల్ కూడా చేరతాడనే ప్రచారం నిజమేనని తెలిసింది.

# 25 ఏళ్ళలో మొదటిసారి పాడుతా తీయగాలో దిల్ రుబా



తెలుగులో ఇప్పుడు ఎన్ని పాటలు పాడే షోలైనా ఉండొచ్చు కానీ ఈటీవీలో ప్రసారమయ్యే పాడుతా తీయగాకున్న ఫాలోయింగ్, గౌరవం చాలా ప్రత్యేకం. ముఖ్యంగా ఎస్పి బాలసుబ్రమణ్యం గారు ఉన్నప్పుడు రెండు దశాబ్దాల పాటు దాన్ని నడిపించిన తీరు సంగీత ప్రియులకు బోలెడు ఆనందంతో పాటు విజ్ఞానాన్ని పంచింది. టాలీవుడ్ నంతా ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేలా చేసింది. బాలుగారు పోయాక ఆయన వారసత్వాన్ని అందుకున్న ఎస్పి చరణ్ ప్రోగ్రాంని అదే స్థాయిలో కొనసాగించేందుకు కష్టపడుతున్నారు. ఇప్పుడు దిల్ రుబా ప్రస్తావన ఎందుకో చూద్దాం. ఈ నెల 14 విడుదల కాబోతున్న కిరణ్ అబ్బవరం దిల్ రుబా ఇప్పుడీ పాడుతా తీయగాలో పాల్గొనబోతోంది. ప్రమోషన్లలో భాగంగా ఇది చేస్తున్నారు. అయితే పాతికేళ్ల ఈ షో ప్రస్థానంలో ఎప్పుడూ ఏ సినిమా యూనిట్ ఈ ప్రాంగణంలో అడుగు పెట్టలేదు. ఆ ఘనత దిల్ రుబాకే దక్కింది. బిగ్ బాస్, క్యాష్, ఢీ, ఇండియన్ ఐడల్ లాంటి ఎన్నో ప్రోగ్రాంస్ లో కొత్త రిలీజుల పబ్లిసిటీ జరగడం సహజమే కానీ పాడుతా తీయగాలో చేయడం మాత్రం ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిపోతుంది. రెగ్యులర్ తరహాలో కాకుండా ఆ కార్యక్రమం హుందాతనం కాపాడేలా దిల్ రుబా ఎపిసోడ్ డిజైన్ చేసినట్టు సమాచారం. క ఇచ్చిన బ్లాక్ బస్టర్ కిక్ తో కిరణ్ అబ్బవరం మంచి జోష్ లో ఉన్నాడు. నిజానికి దిల్ రుబా దీనికన్నా ముందు రిలీజవ్వాల్సిన సినిమా. కానీ కని ముందు విడుదల చేయడం వల్ల చాలా ప్లస్ అయ్యింది. మంచి బిజినెస్ ఆఫర్లతో కిరణ్ మూవీకి ఓపెనింగ్స్ రాబోతున్నాయి.

# ఉద్యమం చేయాలంటున్న దిల్ రాజు



గత కొన్ని నెలలుగా పరిశ్రమను తీవ్రంగా పట్టి పీడిస్తున్న హెచ్డి పైరసీ కట్టడికి ఏ చర్యలు తీసుకున్నా ఎలాంటి ఫలితం ఇవ్వకపోవడం ఇండస్ట్రీ వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. రిలీజ్ రోజు గడవకుండానే మంచి క్వాలిటీతో ప్రింట్లు ఆన్ లైన్ లో ప్రత్యక్షం కావడం చాలా సీరియస్ మ్యాటర్. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రీ రిలీజ్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో నిర్మాత దిల్ రాజు దీని గురించి ఆలోచించాల్సిన విషయాలు పంచుకున్నారు. ప్రతి శుక్రవారం ఎవరి నొప్పి వాళ్ళదనే తరహాలో మిగిలిన వాళ్ళు పట్టించుకోకపోవడం వల్లే పైరసీని కంట్రోల్ చేయలేకపోతున్నామని, ముఖ్యంగా సహకారం కొరవడిందని అన్నారు. అందరూ కలిసికట్టుగా ఒక ఉద్యమంలా నడుం బిగిస్తే తప్ప ఇలాంటి సమస్యలు పరిష్కరించుకోలేమని, ఎవరి దారి వాళ్ళు చూసుకుని సోమవారం రాగానే కొత్త షూటింగుల్లో బిజీ అయితే, చేయగలిగింది ఏముందంటూ కుండ బద్దలు కొట్టేశారు. ఇది ముమ్మాటికీ వాస్తవం. గేమ్ ఛేంజర్ నుంచి తండేల్ దాక జరిగింది ఇదే. మూడు నాలుగు రోజులు హడావిడి చేయడం తప్ప పైరసీ చేసిన వాళ్ళను పట్టుకోవడం కానీ, లేదా దాని మూలలను వెతికేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం కానీ మచ్చుకు కూడా కనిపించలేదు. డౌన్లోడ్ చేసుకున్నా కేసులు పెడతామని చెప్పడమే తప్ప అసలు ప్రింట్ బయటికి తెచ్చేనోళ్లనే పట్టుకోలేదు. దిల్ రాజు చెప్పినట్టు పక్కడి ప్రాబ్లమ్ నాది కాదు అనుకున్నన్ని రోజులు పైరసీ లాంటి భూతాలు వెంటాడుతూనే ఉంటాయి. ఇప్పుడు ఏకంగా హెచ్డి రూపాన్ని సంతరించుకున్నాయి. నిర్మాణంలో ఉన్న పెద్ద సినిమాల నిర్మాతలు కంకణం కట్టుకోవాలి.

# మహిళలకు అంకితం



షెరాజ్ మెహ్ది దర్శకత్వంలో రూపొందిన కొత్త సినిమా 'పౌరుషం – ది మ్యాన్‌హుడ్'. యువీటీ హాలీవుడ్ స్టూడియోస్ (యూఎస్ఏ), శ్రేయ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మించారు. ఈ సినిమాలో సుమన్ తల్వార్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, జ్యోతి రెడ్డి, శైలజ తివారీ, అనంత్, కనిక, జబర్దస్త్ కెవ్వు కార్తీక్, జబర్దస్త్ హీనా, జబర్దస్త్ కట్టప్ప, బాల గంగాధర్, వైజాగ్ షరీఫ్, లక్ష్మి, రవి వర్మ వంటి వారు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, సంగీతం షెరాజ్ మెహ్ది అందించారు. డివి ప్రభు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ సినిమా ఈనెల 7న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. హీరో, దర్శకుడు, సంగీత దర్శకుడు షెరాజ్ మెహ్ది మాట్లాడుతూ, "ఇది నా మనసులోంచి వచ్చిన కథ. ఒకరి వల్ల మంచి వాళ్ళు ఎలా సఫర్ అవుతారు అనే మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. అలాగే కమర్షియల్ సినిమా కూడా. సినిమాలో రొమాంటిక్, యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అన్ని ఉన్నాయి. హీరోయిన్ కనికా చాలా డిసిప్లిన్ అమ్మాయి. చాలా బాగా నటించింది. నటి మధి చిన్న ఏజ్‌లోనే స్టార్ స్టేటస్ తెచ్చుకుంది. ఈ సినిమా ప్రతి అమ్మాయికి అంకితం. ఈనెల 8 ఉమెన్స్ డే. ఒక రోజు ముందే ఇది రిలీజవుతుంది. ప్రపంచంలో ఆడవాళ్లు లేకుండా మగవాళ్ళు లేరు. వాళ్ళ సపోర్ట్‌తో మనం ముందుకెళ్లాలి అని ఒక బ్యూటిఫుల్ కాన్సెప్టే ఈ సినిమా. ఇంతకు ముందు 8 సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా చేసాను. ఇది తొమ్మిదో సినిమా. నిర్మాతలు నాకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు.